

"నీకు దయ్యాలంటే నమ్మకం ఉందా?" అడిగిందామె.

"లేదు... దయ్యాలన్నా, భూతాలన్నా, పిశాచాలన్నా... ఇంకా వాంపైర్లన్నా, డెవిల్స్, విఛెస్ అన్నా కూడా నమ్మకం లేదు నాకు" అన్నాను నిశ్చలంగా.

గోదావరి అలల శబ్దం మంద్రంగా వినిపిస్తోంది. గోదావరిలో దశమి వెన్నెల ప్రతిఫలించి, నయనానందం కలుగజేస్తున్నది. సమయం రాత్రి పదకొండు గంటలు.

# ఆశ

ఎన్.సి.కళ్యాణ్‌రఘు

"మరి నన్ను చూసి ఉలిక్కిపడ్డావెందుకు?" అడిగిందామె.

"నేను ఒంటరిగా ఉన్నాను. ఇలా రాత్రిళ్లు గోదావరి గట్టుకి వచ్చి, ఈ చింత చెట్టు క్రింద కూర్చోవటం నాకు అలవాటే... అయితే ఈ సమయంలో ఇక్కడికి ఎవ్వరూ రారు. అందుకని నిన్ను చూడగానే కొంచెం కంగారు పడ్డాను"

అన్నాను ఆమెవైపు తేరిపార చూస్తూ.

ఆమెకు సుమారు ఇరవై ఏళ్లు ఉంటాయి. తెల్లటి చీర కట్టుకుంది. జుట్టు విరబోసుకుంది. నదిపై నుంచి వీచే తెమ్మెర గాలులకు ఆ ముంగు రులు అల్లల్లాడుతున్నాయి.

ఆమె నావైపు కూడా నిశితంగా చూసింది.

''నీదే వూరు? నీపేరేమిటి? ఈ పరిసరాల్లో నిన్ను ఎక్కడా చూసినట్లుగా గుర్తు లేదు'' అన్నాను.

''నా పేరు ఆశా ఉమంగ్. ప్రస్తుతం ఈ చింత చెట్టే నా ఊరు.. ఇల్లూ....'' అందామె కొంచెం నవ్వి. ఆమె నవ్వు చక్కగా ఉంది.

''నన్ను భయపెట్టాలని ప్రయత్నం చేస్తే ఓడిపోతావు. చదువుకున్నవాడిని, నిరుద్యోగిని ఎవ్వరూ భయపెట్టలేరు'' అన్నాను.

''నీకు దయ్యాలంటే నమ్మకం లేదన్నావు గదా! అయితే అక్కడ దూరంగా గోదావరి లంకలో కనిపిస్తున్నవి కొరివి దయ్యాలు కాక మరేమి టంటావు?'' అంది ఆశా ఉమంగ్.

''నాన్సెన్స్.... అక్కడ శ్మశానం ఉంది. మానవ కళేబరాల్లోని ఎముకల్లోని గంధకం... భాస్వరం వగైరా ద్రవ్యాలు ప్రకృతిలోని ప్రాణవాయువుతో జరిపే రసాయనిక చర్యల వలన రాత్రిళ్లు మండు తాయి. పగలు మండినా, మనకు సూర్యుడి వెలుగులో ఆ మంటలు స్పష్టంగా కనిపించవు'' అన్నాను.

''అయితే ఈ చింత చెట్టు గుబురు ఆకుల్లోంచి వినబడే ఆ వింత శబ్దాలు ఏమిటి? అవి జడల దయ్యాలు చేసే వికృత ధ్వనులు కావా?'' అంది.

నేను విరగబడి నవ్వాను. ''జడల దయ్యాల మాట బుల్ షిట్... గుబురుగా ఉన్న కొమ్మలూ... ఆకుల మధ్యనుంచి గాలి కొంత ఒత్తిడిలో ప్రవహి స్తున్నప్పుడు ఆ రాపిడి ధ్వనులు రకరకాల శృతుల్లో వినిపిస్తాయి. ఉదాహరణకి వెదురుగొట్టానికి రంధ్రాలు చేసి, అందులోకి గాలిని ఊదినప్పుడు అనేక రకాల సంగీత స్వరాలు వినిపించవూ? ఇంకా చెప్పాలంటే హార్మోనియం పెట్టెలో...''

''మహాప్రభో నీకు ఒక నమస్కారం! నువ్వు భలే శాస్త్రీయంగా ఆలోచిస్తావ్!'' అందామె. కిలకిల నవ్వి.

నేను కూడా నవ్వాను. ''నేను పుట్టి పెరిగిన వాతావరణం అలాంటిది. నేను సైన్సు చదువు కున్నాను. ఏదైనా శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఆలోచించిగానీ నమ్మను. అర్ధరాత్రి కావస్తున్నది. దయచేసి నువ్వు మీ ఇంటికి వెళ్లిపో! ఈ ఊరిజనం మంచి వాళ్లు కారు. మనం ఇద్దరం ఇలా కలిసి ఉండటం చూసారంటే, తెల్లారేసరికి పంచాయితీ పెట్టి ఊళ్లోంచి వెళ్లగొడతారు...'' అన్నాను.

''నేను నా ఇంట్లోనే ఉన్నాను. నువ్వే మా ఇంటికి వచ్చావు. కాస్సేపు కూర్చుని వెళ్లు. నీ కోరిక నేను తీరుస్తాను'' అంది.

''కొంపదీసి నువ్వు కామినీ పిశాచివా ఏమిటి? కోరికలూ... గీరికలూ అంటున్నావు. అయినా నేను పిశాచాలు ఉంటాయని నమ్మననుకో'' అన్నాను.

ఆమె నిట్టూర్చింది. కోరిక అనగానే నీకు కామం తప్ప మరేదీ గుర్తు రాలేదా! ఏం చేస్తాం! ప్రస్తుతం లోకం అంతా రొమాంటిక్ థాట్ మీద నడుస్తోంది. కళలూ... కథలూ... సినిమాలూ అన్నీ రొమాన్స్ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. నేను తీర్చగలిగే కోరిక ఆ టైపు కాదు. నేను నీకు చెల్లిలాంటి దానిననుకో! లేకపోతే తల్లిలాంటి దానిననుకో...''

నేను మళ్లీ విరగబడి నవ్వాను. ''నువ్వు తెలుగు రొమాంటిక్ కథకుల నోట్లో దుమ్ము కొట్టేలా ఉన్నావు. విరహిణి దయ్యాలూ... కామినీ పిశా చాలు... అందమైన అబ్బాయిలను అప్పడంలా నమిలి మింగేసే భూతాల గురించి విన్నాం... చదువుకున్నాం గానీ... నీలాంటిది ఒకటి ఉంటుం దని ఎవ్వరికీ ఆలోచన రాను కూడా రాలేదు. అయినా నువ్వు మామూలు మనిషివే అని నాకు నిశ్చయంగా తెలుసు. నువ్వు కట్టుకున్న చీర ఏ షాపులో, ఎంత ధరకు కొన్నావో నేను చెప్పగలను. నువ్వు ఏ షాంపూ వాడతావో నీ జుట్టు వాసనని చూసి నేను చెప్పగలను. నువ్వు పెట్టుకున్న కాటుక...''

''చాలించు నీ ఉపన్యాసం.... నేను మామూలు మనిషిని కానని, నిన్ను ఎలా నమ్మించాలి? నీకు ఇష్టమైన పదార్థం ఒకటి చెప్పు... దానిని నీకు క్షణంలో ఇస్తాను'' అందామె.

''ఏదైనా ఇస్తావా?'' ఆమెను వింతగా చూస్తూ.

''ఇస్తాను... ఏం కావాలి నీకు? లడ్డూనా! ఢిల్లీ బాదుషానా! రసగుల్లా... సందీష్... ఏదైనా ఫరవాలేదు...''

నేను ఆలోచించాను. ''సరే! అడిగావు కాబట్టి చెబుతున్నాను. ఈ వస్తువుని నువ్వు ఇవ్వకపోయినా నేనేమనుకోను. ఎందుకంటే అది నువ్వు తేలేవు కాబట్టి. నాకు గడ్డ పెరుగు అన్నంలో మాగాయి నంచుకుతినటం చాలా ఇష్టం. ఇప్పుడు చూపించు నీ చమత్కారం'' అన్నాను.

ఆమె చిరునవ్వుతో రెండు చేతులనీ చాచింది... ఆశ్చర్యం! ఆమె చేతిలో పెద్ద స్టీలు గిన్నె, అందులో గడ్డపెరుగు అన్నం... ఆ అన్నం మీద ఎర్రటి కారం ఊటలో తేలుతున్న మాగాయి ముక్కలు.... ఆ స్టీలు గిన్నెపై చెక్కబడిన 'నల్లాని పరంధామయ్యగారి స్మృత్యర్థం' అన్న అక్షరాలు వెన్నెల వెలుగులో స్పష్టంగా కనిపించాయి.

నా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. ''ఇదెలా సాధ్యం? నీ పేరుని బట్టి, నువ్వు హిందుస్థానీ మనిషివని ఊహించాను. నువ్వు సజెస్టు చేసిన తినుబండారాలు కూడా ఉత్తర దేశంవే! కానీ అచ్చమైన తెలుగు మాగాయి... ఇది కలా, నిజమా?'' అన్నాను. ఆమె ముఖంలో మందహాసం వెల్లివిరిసింది. 'ఇది కలా కాదు... వైష్ణవ మాయ అంతకన్నా కాదు... ఇది కళ్లెదురుగా కనిపించే పచ్చినిజం... నిజం లాంటి భ్రాంతి. ఈ పెరుగన్నం నీ కళ్లకి కనిపిస్తుందేగానీ, ఇది నీకు ఆస్వాదయోగ్యం కాదు. నేను ఒక వస్తువుని ఉన్నట్లుగా చూపించగలనే గానీ, దానిని నేను భౌతికంగా సృష్టించలేను. నా శక్తులకి కూడా కొన్ని పరిమితులున్నాయి'' అంది.

''చూడు, ఆశా ఉమంగ్....'' నేను ఏదో చెప్పబోయాను.

''నాపేరు ఆశాతరంగ్....'' అందామె.

''అప్పుడే పేరు ఎందుకు మార్చుకున్నావు?'' అన్నాను.


''నా గురించి నీకు అవగాహన కలుగుతున్న కొద్దీ నా పేరు కూడా మారుతూ ఉంటుంది'' అందామె. నేను మళ్లీ ఆమె వైపు చూసాను. ఆమె కట్టుకున్న చీర తెల్లగా లేదు. బంగారు రంగుతో పట్టులా మెరుస్తున్నది.

''చీర ఎప్పుడు మార్చావు?'' అడిగాను విస్మయంగా.

''నేను మార్చలేదు. నా యెడల నీ దృక్పథం మారింది. అందుకనే చీర రంగు కూడా మారి నట్లుగా నీకు అనిపిస్తోంది'' అంది.

నాకు ఆమెపై ఎందుకో నమ్మకం కలిగింది. ఆమెలో కొన్ని అద్భుత శక్తులు ఉన్నాయన్న విశ్వాసం కూడా బలపడింది.

''చూడు ఆశాతరంగిణీ! నేను ప్రస్తుతం నిరుద్యోగిని... ఎంతో నిరాశపడుతూ ఉన్నాను. నాకు నువ్వు మేలు ఎలా చేయగలవు?'' అడిగాను.



''అసలు ఉద్యోగమంటే ఏమిటి? నిన్ను నువ్వు పోషించుకుంటూ, సమాజానికి కూడా ఉపయోగ పడేలా చేసే వ్యవస్థే కదా ఉద్యోగమంటే! అది లేకపోతే నిరాశ ఎందుకు? డబ్బు ఉంటే ఇంక ఉద్యోగమెందుకు?'' అంది.

''ఆ డబ్బు సంపాదించటానికి ఉద్యోగమో, వ్యాపారమో చేయాలిగదా!'' అన్నాను.

''సరి, నీ సమస్య నాకు అర్థమయింది. చెప్పానుగా నా శక్తులకీ, మంత్రాలకీ కొన్ని పరిమితులున్నాయి. నేను డబ్బుని సృష్టించ లేను'' అంది.

''ఇది చెప్పటానికేనా ఇంత బిల్డప్ ఇచ్చావు? నా టైం అంతా వేస్ట్ చేసావు'' అన్నాను నిష్టూరంగా.

''అయ్యో! అంతకోపం ఎందుకు? మంత్రం తెలియదన్నాను గానీ, తంత్రం లేదన్నానా! నువ్వు నాకు నచ్చావు. అందుకని కృతజ్ఞతగా ఐదులక్షల రూపాయలు నీకు దొరికే చోటు చూపిస్తాను. నువ్వు ఆ డబ్బు తీసుకుని కలకాలం హాయిగా జీవించు'' అంది.

''కొంపదీసి ఏ స్టేట్ బ్యాంక్ లాకరునో చూపిస్తావా ఏమిటి?'' అన్నాను చిరాకు పడుతూ.

''నా మీద ఇంకా అపనమ్మకమేనా! అదిగో దూరంగా కనిపిస్తున్నది కదా గోదావరి లంక... ఆ లంకలో పాతకాలం నాటి స్మశానం ఉంది. పగిలి పాడయిపోయిన సమాధులు ఉన్నాయి. ఆ సమాధుల్లో నీకు 5 లక్షల రూపాయలు దొరుకుతాయి. ప్రయత్నించి చూడు'' అందామె.

నేను బదులు చెప్పలేదు.

''ఏం! గోదావరి దాటలేనని భయమా! చీకటిలో లంకలో నడవటానికి సందేహమా! లేక ఇంకా నా మాటపై నీకు గురి కలగలేదా!'' అంది.

నాకు చాలా ఆవేశం కలిగింది. ''నాకు భయమా! ఈ గోదావరి కాలవని నేను పదేళ్ల వయసులో ఇటునుంచి అటు ముమ్మార్లు ఈదాను. ఈ గోదావరి లంకలు నాకు కొట్టిన పిండి'' అన్నాను లేచి నిలబడి.

''ఇంక ఆలస్యమెందుకు? నీళ్లలోకి దూకు'' ఆజ్ఞాపించింది ఆమె. నేను రెండో ఆలోచన లేకుండా నీళ్లలోకి దూకేసాను.

* * *

''ఇది నిశ్చయంగా శని ప్రభావమే ''అంది మమ్మీ కొంగుతో కళ్లు తుడుచుకుంటూ. డాడీ ఆ గదిలోనే పడక కుర్చీలో కళ్లు మూసుకుని ఉన్నారు. ఆయన ముఖంలో చెప్పలేనంత ఆందోళన... నన్ను చూడటానికి బాబాయి, పిన్నీ, పెద్దమామ, పెద్దత్త కూడా వచ్చారు.

''ఏంటి మమ్మీ నీ చాదస్తం! నేను బాగానే ఉన్నాను గదా!'' అన్నాను చిరాగ్గా... నేను లేచి కూర్చోబోయాను.

''లేవకు... అలాగే పడుకో... ఒళ్లంతా చూడు. రెల్లు గడ్డి ఎలా గీరుకుపోయిందో!'' అంది పిన్నమ్మ. మరికాస్త ఆయింట్‌మెంటు నా కాళ్లకి రాస్తూ.

''రెల్లు గడ్డి కాదు. దర్భగడ్డి'' అన్నాను నేను.



## గెలుపు

లాయర్‌గారికి కొంచెం దైవభక్తి జాస్తి. క్లయింట్లకు లా పాయింట్లతో పాటు భక్తి ముక్తి గురించి బోధిస్తుంటాడు.

ఒకసారి ఒక క్లయింట్ వచ్చి ''లాయర్‌గారూ, కేసు గెలుస్తామా, ఓడతామా?'' అని అడిగాడు.

లాయర్‌గారు చిరునవ్వు నవ్వి ఒక పిట్ట కథ ఎత్తుకున్నాడు.

''స్వర్గానికి, నరకానికి మధ్య ఒక పెద్ద గోడ వుంటుంది. ఒకసారి ఆ గోడను ఎవరో కూల్చేసారు. నేరస్తులెవరనే విషయంపై స్వర్గ నరకలోకవాసుల మధ్య వాదన మొదలైంది. ఈ కేసులో ఎవరు గెలుస్తారంటావ్?'' అని అడిగాడు లాయర్.

''ఇంకెవరు గెలుస్తారండి, నరకలోక వాసులే... లాయర్లంతా అక్కడేగా వుంటారు'' కాన్ఫిడెంట్‌గా పక్కాగా చెప్పాడు క్లయింట్.

''ఏదో ఒకటి... అయినా అంతరాత్రివేళ కాలువలోకి ఎందుకు దిగావు? లంకలో నీకేం పని? తోచకపోతే ఏ రాజమండ్రియో, అమలాపురమో వెళ్లి సినిమా చూసి వస్తానంటే నేను కాదంటానా!'' డాడీ మందలించినట్లుగా అన్నా ఆ స్వరంలో పదును లేదు. వాత్సల్యమే ఉంది.

''ఇంతమంది ఉన్నారు... ఇంత పెద్ద దేశ ముంది. ఉద్యోగం లేక పిల్లాడు నిరాశపడిపోతు న్నాడు. ఎప్పుడు ఏ అఘాయిత్యం చేస్తాడో అని వేయికళ్లతో కనిపెట్టుకుని చూస్తూనే ఉంటాను. అయినా వయసొచ్చిన కుర్రాడిని ఎంతకాలం కాపలా కాయగలం?'' మమ్మీ ఈ సారి కన్నీళ్లు తుడుచుకోలేదు.

''అబ్బ! నువ్వు కాస్సేపు ఊరుకుంటావా? నాకు లేనిపోని ఆలోచనలు రేకెత్తించకు'' అన్నాను కోపంగా. నాకు మా మమ్మీ మీద ఇష్టమే గానీ, ఆవిడ నా మనసులోని మర్మాలని అంత స్పష్టంగా పదిమందిలో కూర్చుని చెప్పేస్తే నాకు ఇబ్బందిగా ఉంటుంది.

పెద్ద మామ కలుగజేసుకున్నాడు. ''మా గోదావరీ... మా బొబ్బర్లంక అంటూ మడి గట్టుకు కూర్చుంటే ఉద్యోగం ఎలా వస్తుంది? వీడిని నాతో విజయవాడ పంపించు. నెల రోజుల్లో మంచి ఉద్యోగం వేయించేస్తాను'' అన్నాడు.

పెద్దత్త కూడా వత్తాసుపలికింది. ''అవును వదినగారూ! మాకు మాత్రం ఎవరున్నారు? మా అబ్బాయిలిద్దరూ అమెరికాలోనే కాపురమున్నా రాయ. యనమల కుదురులో లంకంత ఇల్లు, వంటమనిషీ ఉంది. రోడ్డు దాటితే కృష్ణమ్మతల్లి పలకరిస్తూ ఉంటుంది. అనుకుంటాం గానీ గోదావరి తల్లికీ, కృష్ణమ్మతల్లికీ తేడా ఏముంది? ఇద్దరి తల్లులా మూలపుటమ్మ గంగమ్మతల్లి కాదూ!'' అంటూ ఏదో నదీ పురాణాలు చెప్పుకువచ్చింది.

మమ్మీ ''సరే'' అంది. డాడీ ''సరే'' అన్నారు. ఊరూ వాడా అంతా ''సరే'' అంది. నేను కూడా ''సరే'' అనక తప్పలేదు.

* * *

గోదావరి లంకల్లో దర్భగడ్డి వుంటే కృష్ణ లంకల్లో రెల్లు గడ్డి ఉంటుంది. అక్కడ అరటి చెట్లు, తమలపాకు తోటలూ కనువిందు చేస్తే ఇక్కడ సీమచింత చెట్లు విరివిగా దర్శనమిస్తాయి.

సమయం రాత్రి పది గంటలు... నేను పెద్దమామ గారింట్లో భోజనానంతరం డాబా మీద పచార్లు చేస్తున్నాను. సకలఫల సంపంగి పూలవాసన కమ్మగా గాలిలో తేలివస్తున్నది. ఎవరో కలకల నవ్వినట్లయింది. నేను తలెత్తి చూసాను.

''హాయ్ ఆశాతరంగిణీ'' అన్నాను.

''నీ ఉద్యోగం ప్రయత్నం ఎంతవరకూ వచ్చింది?'' అంది.

''విజయవాడలో యనమలకుదురు దాకా వచ్చింది'' అన్నాను తిక్కగా.

''సారీ! నా మీద కోపం వచ్చింది గదూ! ఏం చేయను? నాకు జాగ్రఫీ పరిజ్ఞానం తక్కువ. అందుకే కృష్ణలంక అనబోయి. గోదావరి లంక అనేసాను. నీకు చాలా శ్రమ కలిగించాను గదూ!'' అంది జాలిగా.

''శ్రమా! శ్రమన్నరా! అంత రాత్రివేళ గోదావరిలో ఈదటం... లంకలో కిలోమీటరు నడవటం. సమాధులని తవ్వీపోయటం... తిరిగి ఇల్లు చేరేసరికి వళ్లంతా దోమకాట్లు... నీటిగాయాలూ... 5 లక్షలు కాదుగదా! 5 పావలాలు కూడా దొరకలేదు'' అన్నాను ఆవేశంగా.

''సారీరా! ఈ సారి కృష్ణలంకల్లో ప్రయత్నించు. నీ శ్రమకి ఫలితం తప్పక దొరుకుతుంది. నా వలన పొరపాటు జరిగినందుకు ప్రాయశ్చిత్తంగా నీకు 10 లక్షల రూపాయలు దొరుకుతాయి'' అంది. ఆమె కట్టుకున్న చీరకు కుట్టబడిన ముత్యాలూ... కెంపులూ వెన్నెల వెలుగులో తళతళ మెరిసాయి.

''చూడు... ఆశాతరంగిణీ....'' నేను ఏదో

చెప్పబోయాను.

''నా పేరు ఆశా విరాగిణి...'' అందామె. ఆమె పేరు మారినందుకు నాకు ఆశ్చర్యం కలుగలేదు.

''చూడు ఆశా! మహా తల్లీ! నేను కృష్ణానది దరిదాపులకి వెళితే, మా మామ నా చెమ్డా లెక్కదీస్తాడు'' అన్నాను చేతులు జోడించి.

''10 లక్షల కోసం చిన్న అబద్ధం చెప్పలేవా! ప్రాణ విత్తమాన భంగమందు బొంకవచ్చునని శుక్రనీతి'' అంది ఆశా.

''సరే! రేపు ఉదయం నుంచి పని ప్రారంభిస్తాను... పది లక్షలకి ఒక్క రూపాయి తగ్గినా నీ అంతు చూస్తాను. ఏదీ, నేను చూస్తూ ఉండగా మాయమయి నీ శక్తి ప్రదర్శించు'' అన్నాను కొంటెగా.

''నా పేరు ఆశ... నేను మాయమయిన క్షణమే నువ్వు నిష్ప్రయోజకుడవవుతావు'' అంది గంభీరంగా.

నేను తలవంచుకుని మేడమెట్లు దిగి హాల్లోకి వచ్చాను.

''రేపు నాకు తెలిసిన పెద్దమనిషి దగ్గరకు తీసుకువెళతాను. ఉద్యోగం ఆయనే చూపిస్తాడు'' అన్నాడు పెద్దమామ.

''మొన్ననేగా ప్రయాణం చేసి ఇంతదూరం వచ్చాడూ! ఉద్యోగానికి అప్పుడే ఏం ఖంగారు వచ్చింది? నెలరోజులు రెస్టు తీసుకోనివ్వండి... తర్వాతే ఉద్యోగమైనా... సద్యోగమయినా!

కుర్రాడు చెంగు చెంగున ఇంట్లో తిరుగుతూ ఉంటే, ఎంత సందడిగా ఉందో! మనకి మాత్రం ఎవరున్నారూ?''

పెద్దత్త మరో పురాణం చదివింది. పెద్దమామ సరే అనక ఏం జేస్తాడు? ''వెన్నెల్లో హాయ్ హాయ్'' అని పాడుకుంటూ నేను చెంగు చెంగున ఎగురుతూ నా గదిలోకి వెళ్లిపోయాను. మరునాడూ, ఆ తర్వాత రోజూ, మరో రోజు కూడా నేను ఉదయమే కృష్ణ లంకల్లోకి వెళ్లి ఇసుకని నాకు అనుమానం వచ్చిన ప్రతీ చోట తవ్వి చూసాను. కరెంటు స్తంభాల క్రింద తవ్వి చూసాను. నీటి జల తగిలింది. నిద్రగన్నేరు చెట్ల మొదళ్లు తవ్వి చూసాను... చెదల పుట్టలూ... వానపాములూ కనిపించాయి. పది లక్షలు కాదు గదా! పది లక్క పిడతలైనా దొరకలేదు. నాకు వళ్లు మండుకు వచ్చింది.

''ఆశాతరంగిణీ! ఆశా విరాగిణీ! శాకినీ! ఢాకినీ! నన్ను పిచ్చి వాడిని చేసావు గదే! నా కళ్ల ముందు కనబడు... నీ పీక నులిమి...''

ఆశ నా కళ్ల ముందు నిలబడింది. ఎప్పటి లాగానే ఉంది. ఆమె ముఖం ప్రశాంతంగా ఉంది. ఆమె నా కళ్లల్లోకి చూసి జాలిగా నవ్వింది.

''సారీ! ముందరే చెప్పానుగా! నాకు రూపాయినోట్లని సృష్టించే శక్తిలేదు. ఈ లంకల్లో ఉన్న డబ్బుని రైతులు ధాన్యంగానూ, చెరకుగానూ మార్చేసుకుని తీసుకువెళ్లి వెళ్లిపోయారు. నీలాంటి వారికి ఇక్కడ ఏదీ దొరకదు'' అంది.

''ఆహా! ఏం సిద్ధాంతం చెప్పావు తల్లీ!'' అన్నాను వ్యంగ్యంగా.

''అలా వెక్కిరించవద్దు. నీకు మేలు చెయ్యాలన్న నా తాపత్రయం చాలా పవిత్రమైనది. దానికి వంకలు పెట్టవద్దు...'' అంది ఆశ.

''మంచిది... ఈసారి ఇంకేం చేయమని ఆజ్ఞాపించబోతున్నావు? నన్ను నదులు దాటమనీ, నేల తవ్వమనీ చెప్పవద్దు. జబ్బలు కాయలు కాసిపోతున్నాయి'' అన్నాను కొంచెం శాంతించి.

''శాకినీ, ఢాకినీ అని ఎందుకు పిల్చావు నన్ను? నీ కళ్లకి నేను ఎలా కనిపిస్తున్నాను? ఏమైనా నువ్వు వారిని నోరారా పిలిచావు కాబట్టి వారి సహాయం నీకు లభిస్తుంది'' అంది ఆశ.

''ఇదంతా బుల్‌షిట్... శాకినీ లేదు, ఢాకినీ లేదు. ఇవన్నీ మూఢనమ్మకాలు'' అన్నాను. ప్రక్కరాష్ట్రంలో 'దంతేశ్వరీదేవి' అమ్మవారి గుడి ఉంది. శాకినీ, ఢాకినీ అనే నదులు ఆ గుడికి అటూ ఇటూ ప్రవహిస్తూ ఉంటాయి. నువ్వు వెళ్లి ఆ నదుల్లో స్నానం చేస్తే, ఆ దేవతల అనుగ్రహం నీకు కలుగుతుంది. నీకు ఇరవై కిలోల బంగారు లభించే మార్గం సుగమం అవుతుంది'' అంది ఆశ.

''ఇరవై కిలోల బంగారమా! బూడిదా!'' అన్నాను.

''బంగారమే! నువ్వు సైన్సు చదువుకున్నావు గదా! సాధారణ లోహాలనుంచి బంగారం తయారు చేయవచ్చు... ఆ విద్యని 'ఆల్‌కెమీ' లేదా 'స్వర్ణ యోగం' అంటారు. ఉదాహరణకి పాదరసానికి, బంగారంకంటే అణుభారం ఒక్క యూనిట్ మాత్రమే ఎక్కువ. పాదరసం అణువులోకి ఒక న్యూట్రానుని పంపి దాని అణుభారం ఒక్క యూనిట్ తగ్గించగలిగితే అది బంగారంగా మారుతుంది'' అంది ఆశ.

''ఆ విషయం పదవతరగతి చదువుకున్న ఏ కుర్రదయినా చెప్పగలుగుతుంది. అయితే ఈ భూమిపై నిలబడి పాదరసం అణుభారం తగ్గించ గలగటం అసాధ్యం. అది సూర్య గోళంలోని అణు విచ్ఛేదకశక్తి వల్లగాని సాధ్యపడదు. ప్రస్తుతానికి నాకు సూర్యగోళం దగ్గరకు వెళ్లాలన్న ప్రోగ్రామూ లేదు అవకాశమూ లేదు'' అన్నాను.

''తాను ఊహించలేనిది అసంభవమని అనుకోవటం మానవజాతి లక్షణం. కానీ ఆ దంతేశ్వరీదేవి ఆలయం చుట్టూ ఉన్న దండకారణ్యంలో ఉన్న పర్వతసానువుల్లో సంచరించే యోగిపుంగవులకి స్వర్ణయోగం తెలుసును'' అంది.

''ఒకవేళ వారికి ఆ విద్య తెలుసనే అనుకుందాం. పాదరసం నుండి బంగారాన్ని తయారు చేయటం కూడా సాధ్యమే అనుకుందాం. అయితే ఆ యోగీశ్వరులు నాకు బంగారాన్ని తయారుచేసి ఎందుకు ఇస్తారు? అందుకు ప్రతిఫలంగా వారికి నేను ఏమి ఇవ్వాలి?'' అన్నాను.

''నువ్వు వారికి ఏమీ ఇవ్వక్కరలేదు. నీకు తెలుసుగా నా పేరు ఆశ. నేను సాధువులకు కూడా ఆశని కల్గిస్తాను. నీకు 20 కేజీల బంగారం ఇస్తే, వారికి మోక్ష సిద్ధి కలుగుతుందని భ్రమని చూపిస్తాను'' అందామె.


''అయితే నేను ఆ సాధువులని ఎలా గుర్తించగలను?''

''అదేమంత కష్టం కాదు. ఆదివారం ఉదయమే నువ్వు స్నానం చేసి, గుడిలో కూర్చుని ఉండు. కాషాయవస్త్రాలు ధరించి వచ్చిన మొదటి ఇద్దరి సాధువులని నువ్వు పట్టించుకోకు. తర్వాత వచ్చిన మూడవ సాధువు నీకు కావల్సిన వ్యక్తి'' అంది ఆశ.

* * *

నేను పెద్ద మామకూ, అత్తకూ ఏమి చెప్పి బయలుదేరానన్నది ఇక్కడ అప్రస్తుతం. లోక విరుద్ధమయిన పనులు ఏమీ చేయనని వారికి నమ్మకం కలిగించి, నేను దంతేవాడ చేరుకున్నాను. ఊర్లోనే ఉన్న అమ్మవారి గుడికి ఉదయమే వెళ్లాను. శాకినీ, ఢాకినీ నదుల్లో అసలు నీళ్లే లేవు. అక్కడ ఉన్న బావి నీళ్లతో స్నానం అయిందనిపించాను. గుడి గుమ్మంలో కూర్చున్నాను. ఆ బావిలో సమస్త క్షుద్రదేవతలూ నివాసం ఉంటారని నాకు ఆశ చెప్పింది.

ఒక సాధువు వచ్చి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసాడు. అరగంట తర్వాత మరో కాషాయాంబర



ధారి వచ్చి, గుడిమెట్లకి నమస్కరించి లోని వెళ్లాడు. నేను పట్టించుకోలేదు.

పావుగంట తర్వాత మరొకాయన వచ్చాడు. కాషాయపైజామా, అదేరంగు లాల్చీ, మెడలో రుద్రాక్షమాల, నుదిటిపై విభూతి రేఖలు... నేను లేచి నిలబడి, ఆయనకు నమస్కరించాను. ఆయన ''సుఖీభవ'' అని దీవించాడు.

''ఆశ నన్నీపనికి పురిగొల్పింది. మీరు హేమసిద్ధి విద్యను నాకు నేర్పినా సరే లేక డైరెక్టుగా బంగారాన్ని ఇచ్చినా సరే!'' అన్నాను.

ఆయనకి నా మాటలు అర్థం అయినట్లు లేదు. నావైపు విచిత్రంగా చూసాడు. నేను పావుగంట సేపు నా మాటలని ఎక్స్‌ప్లెయిన్ చేసాను. నేను వివరణ ఇస్తున్న కొద్దీ ఆయన కన్ఫ్యూజన్ ఇంకా ఎక్కువ యింది.

''నువ్వు ఇక్కడే కూర్చుని ఉండు. నేను దైవ దర్శనం చేసుకుని వస్తాను. మనం తీరిగ్గా మాట్లాడు కుందాం'' అన్నాడు.

పదినిమిషాల తర్వాత ఆయన బయటకు వచ్చాడు. ''ఆ కారెక్కు'' అన్నాడు. దూరంగా నిల బడ్డ అంబాసీడర్ కారు చూపించి. ఆ కారు ముందర జాతీయజెండా రెపరెపలాడుతూ ఎగురుతోంది. అది ప్రభుత్వ వాహనమని గ్రహించటానికి నాకు ఎక్కువ సమయం పట్టలేదు. నాకు తెలియని నెర్వస్ నెస్ కలిగింది. స్వల్పంగా కంపిస్తూ నిలబడ్డాను. ఇంతలో ఒక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి నన్ను బలవంతంగా కారులో కూర్చోపెట్టాడు. పది నిమిషాల తర్వాత ఒక పెద్ద పాతకాలపు గవర్న మెంటు ఆఫీసు ముందర ఆగింది కారు. నన్ను ఇద్దరు పోలీసులు లోనికి తీసుకువెళ్లారు. అక్కడ సింహాసనం లాంటి కుర్చీలో ఇందాక కనిపించిన కాషాయ సాధువు కనిపించాడు.

''నేను ఈ జిల్లా కలెక్టరుని.... ప్రభుత్వ ట్రెజరీలో 20 కిలోల బంగారం చోరీ అయింది. అది బందిపోటు దొంగలపని అనుకున్నాం. చెప్పు... బంగారం ఎక్కడ దాచావు?'' అన్నాడాయన.

నాకు నోట మాట పెగల్లేదు. ఎలాగో కష్టపడి నా చరిత్ర చెప్పాను. నాకు ఉద్యోగం లేక నిరాశపడుతున్న సమయంలో 'ఆశాతరంగిణి' నాకు కనిపించటం, ఆమె నాకు ఈ గుడికి వెళ్లమని సలహా ఇచ్చిన వైనం ఆయనకు చెప్పాను. రెండు గంటల తర్వాత ఆయనలో మార్పు వచ్చింది.

''నీ నిజాయితీని నేను విశ్వసిస్తున్నాను. నీ మాటలు నాకు నమ్మశక్యంగా లేవు, నీ మానసిక స్థితిపై నాకు సందేహంగా కూడా ఉంది. ఇక్కడ ఉన్న అమ్మవారు క్షుద్రదేవత కాదు. భక్తులపాలిట కొంగుబంగారం. లేనిపోని పేరాశలు పెట్టుకుని జీవితం నాశనం చేసుకోకు... బుద్ధిగా మీ ఊరు వెళ్లి మీ మామయ్య చూపించే ఉద్యోగంలో చేరిపో! పగటి కలలు కంటూ కాలయాపన చేయవద్దు'' అన్నాడాయన.

నేను ఆయనకి నమస్కరించి బయటకు వచ్చాను. అక్కడ నుంచి విజయవాడ రావాలంటే రెండు బస్సులు మారాలి. నేను బస్సు ఎక్కి ఆంధ్రా సరిహద్దు గ్రామమయిన 'కుంటె' వచ్చాను. బస్టాండులో భోజనం చేసి సమీపంలో ఉన్న ఊడలమర్రిచెట్టు క్రింద కూర్చున్నాను.

'ఆశ' నా ప్రక్కనే కూర్చున్నదన్న సంగతి నేను చాలా సేపటి వరకూ గమనించలేదు.

''నన్ను క్షమించు... ఇలా అవుతుందని నేను ఊహించలేదు'' అంది.

నేను కోపంగా ముఖం పక్కకి తిప్పుకున్నాను.

''నాకు మరొక్క అవకాశం ఇవ్వు. నీకు 30 లక్షల రూపాయలు వచ్చే ఏర్పాటు చేస్తాను'' అంది.

''అమ్మతల్లీ! నీకో నమస్కారం.... నా రోజులు బాగున్నాయి కాబట్టి ఇంకా ఇలా బయట తిరుగుతున్నాను. లేకపోతే జైల్లో ఉండవలసిన వాడిని. నువ్వు నన్ను విడిచిపో! నీకు పుణ్యం ఉంటుంది'' అన్నాను.

''మనిషి ఆశాజీవి... మనసు ఉన్నంతకాలం ఆశకూడా ఉంటుంది. నేను నిన్ను విడిచి వెళ్లను... నీకు సలహా ఇవ్వటం నాకు విధి'' అంది.

''నీ నిజాయితీని నేను విశ్వసిస్తున్నాను. నీ మాటలు నాకు నమ్మశక్యంగా లేవు, నీ మానసిక స్థితిపై నాకు సందేహంగా కూడా ఉంది. ఇక్కడ ఉన్న అమ్మవారు క్షుద్రదేవత కాదు. భక్తులపాలిట కొంగుబంగారం. లేనిపోని పేరాశలు పెట్టుకుని జీవితం నాశనం చేసుకోకు... బుద్ధిగా మీ ఊరు వెళ్లి మీ మామయ్య చూపించే ఉద్యోగంలో చేరిపో! పగటి కలలు కంటూ కాలయాపన చేయవద్దు''

''చూడు ఆశమ్మా! బంగారం, వజ్రాలు అని నన్ను మోసపుచ్చలేవు, ఒక్కసారి ఆంజనేయ దండకం చదివానంటే నీ బ్రతుకు బస్టాండు అవుతుంది'' అన్నాను.

ఆమె మధురంగా నవ్వింది. ''పిచ్చివాడా! జీవితంలో స్వప్న సౌధాలని నిర్మించుకోని వారెవ్వరు? ఆ సౌధాన్వేషణలో కష్టనిష్ఠూరాలని ఓర్వని వారెవ్వరు? నిరాశ జీవుల వల్ల ఈ లోకానికి ఏమి ఉపయోగం? నామాట విను. ఇది నీకు ఆఖరి అవకాశం. ఆ తర్వాత నేను నీకు కనిపించను. నువ్వు కూడా మధ్యతరగతి బ్రతుకు ఈడుస్తూ బ్రతక వలసిందే!'' అందామె.

''సరే! ఇదే ఆఖరు... ఈ అన్వేషణలో నాకు అపకారం కలగదని హామీ ఇస్తేనే, నేను ఏ పనైనా చేస్తాను.... ఇది నా షరతు'' అన్నాను.

ఆమె మృదువుగా నా జుట్టుని సవరించింది. ''ఈ ఊరికి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో 'డొంకరాయి' అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఒక నది ప్రవహిస్తూ ఉంటుంది. ఆ నదికి ఆవల ఒడ్డు ఒరిస్సా రాష్ట్రం... ఈవల ఒడ్డు ఆంధ్రా... ఆ నది ఈ కాలంలో ఎండిపోయి ఉంటుంది. నదీ గర్భంలో బండరాళ్లు ఉంటాయి. ఆ రాళ్ల మధ్య కొంతమంది బందిపోటు దొంగలు తమ డబ్బుని దాచుకుంటూ ఉంటారు. అలా దాచుకున్న డబ్బు సుమారు 30 లక్షల రూపాయలు ఉంటుంది. రెండు రాష్ట్రాల మధ్యగల ప్రాంతం కావటంతో రెండు రాష్ట్రాల పోలీసులు అక్కడకు రారు. నువ్వు వెళ్ల ఆ డబ్బు తెచ్చుకుని హాయిగా కలకాలం జీవించు'' అంది.

''ఆ రాళ్లు రప్పల మధ్య నేను తిరగలేను గానీ మరో ఉపాయం చెప్పు'' అన్నాను.

''క్రికెట్టు ప్రాక్టీసు చేయి.... దశ తిరిగిందంటే అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలు... కావల్సినంత డబ్బూ...'' అంది ఆశ నన్ను కవ్విస్తూ...

''అంత సీను లేదుగానీ, మరో సాధనా చెప్పు...'' అన్నాను నేను రెచ్చిపోయి.

''చాలా తేలిక మార్గాంతరం ఒకటి ఉంది. సినిమాల్లో హీరోగా నటించటం.... నీకు అందమూ... శరీరసౌష్టవం.... తెలివితేటలూ అన్నీ ఉన్నాయి. వెంటనే హైదరాబాదు వెళ్లు...'' అంది ఆశ.

''వద్దులే...! ఆ డాన్సులూ... ఫైటింగులూ నేను చేయలేను. డొంకరాయి వెళ్లి ఆ నిధి నిక్షేపాలను వెలికితీస్తాను. నేను నా ప్రయత్నంలో విఫల మయితే, తిరిగి విజయవాడ వెళ్లి మా మామయ్య చూపించే ఉద్యోగంలో చేరిపోతాను'' అన్నాను.

''బెస్ట్ ఆఫ్ లక్'' అంది ఆశ. నేను చూస్తూ ఉండ గానే ఆమె మాయమయింది. విజయవాడ బస్సు రానూ వచ్చింది. వెళ్లనూ వెళ్లింది. నేను మాటల్లో పడి ఆ సంగతి గమనించలేదు. బస్టాండులోకి డొంకరాయి వెళ్లే బస్సు వచ్చింది. నేను ఎక్కేసాను.

* * *

జీవితం ఎంత ప్రశాంతంగా ఉంది. ఆకాశాన్ని అంటే ఎర్రచందనా చెట్లూ.... కొండలూ... లోయలూ... శ్రీరాముడు 14 ఏళ్లు వనవాసం చేసిన ఈ దండకారణ్యం ఎంత పవిత్రమయిన స్థలం?

నేను నదీ గర్భంలో బండరాళ్లపై కూర్చున్నాను. ఆ రాళ్లక్రింద నలికెళ పాములూ... వానకోళ్లూ తప్ప ధనధనేతరములు లేవని తెలుసుకోవటానికి నాకు ఒక్కరోజు పట్టింది. ఎదురుగా మనుష్యుల శ్రమతో నిర్మించబడిన డొంకరాయి డ్యామ్. ఆ క్రిందన పవర్ హవుస్. పవర్ హౌస్‌లో జనరేటర్ల శబ్దాలు లీలామాత్రంగా చెవులకి వినిపిస్తున్నాయి.

''శ్రమజీవికి జగమంతా లక్ష్మీనివాసం''

పాతకాలం పాట నాకు గుర్తుకు వచ్చింది.

''ఓ నిరాశా! ఓ పేరాశా!'' గట్టిగా పిలిచాను. ఎవ్వరూ సమాధానమివ్వలేదు. ఇంక నా జీవితంలో నిరాశ పేరాశలకు తావులేదన్న విషయం స్పష్టమ యింది. నా మనస్సు సంతోషంతో తృళ్లిపడింది. నా అన్వేషణ ఫలించింది. నాకు జ్ఞానోదయమయింది. సూర్యుడి బంగారు కిరణాలు సోకి ప్రకృతి పులకించింది. నేను లేచి నిలబడ్డాను. ఇంక నా ఆశ విజయవాడ ఎంత త్వరగా చేరుతానన్నదే!